ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక

Bullet Edition

ఆదివారం, 23 జూన్ 2024 www.prajaaswaram.com 2PM



## రేపటి నుంచి జూనియర్ డాక్టర్ల సమ్మె

హైదరాబాద్, జూన్ 23 (ప్రజాస్వరం): హైదరాబాద్, జూన్ 23 (ప్రజాస్వరం): రేపటి నుంచి డ్యూటీలకు హాజరు కాబోమని రాష్ట్ర వ్యాప్తంగా జూనియర్ డాక్టర్లు ప్రకటించారు. తమ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ జూనియర్ డాక్టర్లు రేపటి నుంచి సమ్మెకు దిగనున్నారు. అత్యవసర సేవలు మినహా అన్ని సేవలను నిలిపివేస్తామని ప్రకటించారు.



# జగన్నాథుడి అజ్ఞాతవాసం

- భక్తిశ్రద్ధలతో దేవస్నాన పూర్ణిమ
- తరలివచ్చిన భక్తులు
- 14 రోజులు స్వామి దర్శనాలకు బ్రేక్
- 15వ రోజు జరగనున్న నేత్రోత్సవం
- అంగరంగ వైభవంగా రథోత్సవం

14 రోజులు జగన్నాథుడి దర్శనాలకు బ్రేక్

పూరీ, జూన్ 23 (ప్రజాస్వరం): పూరీలోని జగన్నాథ ఆలయంలో ప్రతి సంవత్సరం జగన్నాథ రథయాత్రను నిర్వహిస్తారు. జగన్నాథుని ఈ రథయాత్ర ప్రపంచ వ్యాప్తంగా ప్రసిద్ధి చెందింది. ఈ ఏడాది కూడా జగన్నాథ రథయాత్రకు ఉత్సాహంగా సన్నాహాలు చేస్తున్నారు. జగన్నాథ రథయాత్రకు ముందు.. సహస్త్రధార స్నాన ఆచారం నిర్వహించబడుతుంది. ఆ తర్వాత హిందూ విశ్వాసం ప్రకారం 14 రోజుల పాటు స్వామిని భక్తులు దర్శనం చేసుకోలేరు. జ్యేష్ఠ మాసంలోని పౌర్ణమి రోజున సహస్త్రధార స్నానం చేస్తారు. ఆ రోజును "దేవ స్నాన పూర్ణిమ" అని కూడా అంటారు. ఈ రోజున ఆలయ ప్రాంగణంలోని భారీ సంఖ్యలో భక్తులు భారీగా తరలిరానున్నారు. ఈ నేపథ్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఈ సంవత్సరం దేవ స్నాన పూర్ణిమను జూన్ 22, 2024 శనివారం జరుపుకున్నారు. ప్రతీ సంవత్సరం జ్యేష్ఠ మాసం పౌర్ణమి రోజున పూరీలోని జగన్నాథ దేవాలయంలో జగన్నాథుడు, అతని సోదరుడు బలరాముడు, సోదరి సుభద్రలకు సహస్త్రధార స్నాన ఆచారం నిర్వహిస్తారు. ఈ ఆచారం చాలా వైభవంగా జరుపుతారు. సహస్త్ర ధార స్నానానికి చాలా ప్రాముఖ్యత ఉంది. ఈ ఆచారం జగన్నాథుని రథయాత్రకు నిర్వహించే ప్రధాన ఆచారాలలో ఒకటిగా పరిగణించబడుతుంది. ఈ క్రతువు కోసం స్వామిని 108 కుండలలో పవిత్ర జలం నింపి స్నానం చేస్తారు. ఈ సంవత్సరం దేవ స్నాన పూర్ణిమ జూన్ 22న వచ్చింది. అందుకే ఈ రోజు జగన్నాథుడు, అన్న బలభద్రుడు, సోదరి సుభద్రలకు సహస్త్ర ధార స్నాన ఆచారం నిర్వహించబడింది. ఈ ఆచారాన్ని చూసేందుకు భారీ సంఖ్యలో భక్తులు పూరీకి తరలివచ్చారు. ఈ సమయంలో దేవతా మూర్తులను స్నాన మండపానికి తీసుకొచ్చి ఆలయంలోని పవిత్ర బావిలోని నీటిలో స్నానం చేయించారు. ఈ కాలంలో అనేక రకాల మతపరమైన ఆచారాలు కూడా జరుగుతాయి. పూలు, గంధం, కుంకుమ, కస్తూరి వంటి వాటిని 108 కుండల నీటిలో కలిపి స్నానం చేయడం వల్ల స్నానం చేసే నీరు మరింత స్వచ్ఛంగా.. సువాసనగా మారుతుంది. స్నాన ఆచారం పూర్తయిన తర్వాత జగన్నాథునికి సాధారణ వస్త్రధారణ చేస్తారు. మధ్యాహ్నం సమయంలో జగన్నాథుడిని వినాయకుని రూపంలో ప్రత్యేకంగా అలంకరించారు. భగవంతుని వేషధారణలో జరిగే ఈ ఆచారం చాలా ముఖ్యమైనదిగా పరిగణించబడుతుంది. జగన్నాథుడు, బలభద్రుడు, సుభద్ర దేవిని ప్రసన్నం చేసుకోవడం ద్వారా వారి పట్ల భక్తిని ప్రదర్శించడం ద్వారా భగవంతుని అనుగ్రహం పొందడం ఈ ఆచారం యొక్క ప్రధాన లక్ష్యం. సహస్త్రధార స్నానం అనంతరం జగన్నాథ స్వామివారి దర్శనానికి అనుమతి ఉండదు. ఈ సమయంలో ఆలయ ప్రధాన గర్భగుడి తలుపులు మూసివేయబడతాయి. భక్తులు స్వామిని దర్శనం చేసుకోలేరు. ఇది దేవుని విశ్రాంతి సమయంగా పరిగణించబడుతుంది. ఇలా చేయడం వెనుక ఉన్న నమ్మకం ఏమిటంటే జగన్నాథుడు, బలభద్రుడు, సుభద్రా దేవిలు స్నానం చేయడం వల్ల జ్వరం వస్తుందని నమ్ముతారు. ఈ కాలాన్ని 'అనవాసర' లేదా 'అజ్ఞాతవాసం' అని అంటారు. ఇలా 14 రోజుల పాటు స్వామి గర్భగుడి తలుపులు మూసి వేస్తారు.

### రెండు వారాల అనంతరం రథోత్సవం

14 రోజులు జగన్నాథ, బలరామ, సుభాద్రల విగ్రహాలను పునఃస్థాపన చేస్తారు. విగ్రహాలకు చందనం పూత పూసి ప్రత్యేక మందులతో చికిత్స చేస్తారు. ఇది దేవుని కొత్త జీవితాన్ని పొందే సమయంగా పరిగణించబడుతుంది. 14 రోజుల తర్వాత ఆషాఢ మాసంలోని శుక్ల పక్షం ప్రతిపాద తిథి నాడు 15వ రోజున ఆలయ తలుపులు తిరిగి తెరవబడతాయి. ఈ ప్రత్యేకమైన రోజును కన్నుల పండుగగా జరుపుకుంటారు. ఈ ఆచారంలో జగన్నాథుడు, బలభద్రుడు, సుభద్ర దేవి విగ్రహాలు కొత్త కన్నులు అందించబడతాయి. ఈ రోజున నేత్రోత్సవం అని అంటారు. ప్రపంచ ప్రసిద్ధి చెందిన జగన్నాథ రథయాత్ర ప్రారంభమవుతుంది. ఈ రథయాత్ర సమయంలో భగవంతుడు జగన్నాథుడు, బలరాముడు, సుభద్ర దేవి భారీ రథాలలో కూర్చుని వీధుల్లో ఊరేగుతారు. ఈ భారీ రథాలను వందలాది మంది భక్తులు లాగుతారు.



స్వామి ఆలయంలో ఉన్నప్పుడు మాత్రమే ఎగురవేసే ధ్వజం

## డీఎస్సీకి 2.70 లక్షల దరఖాస్తులు

హైదరాబాద్, జూన్ 23 (ప్రజాస్వరం): తెలంగాణలో 11,062 టీచర్ పోస్టుల భర్తీకి జులై 17 నుంచి కంప్యూటర్ ఆధారిత డీఎస్సీ పరీక్షలు నిర్వహించనున్న సంగతి తెలిసిందే. డీఎస్సీ దరఖాస్తు గడువు జూన్ 20తో ముగియగా.. మొత్తం 2,79,956 దరఖాస్తులు అందాయి. అత్యధికంగా హైదరాబాద్ జిల్లా నుంచి 27,027 దరఖాస్తులు రాగా.. తర్వాత నల్గొండ నుంచి 15,610 దరఖాస్తులు అందాయి. నాన్ లోకల్ కోటా (5 శాతం) కింద అవకాశం ఉండటంతో ఇతర జిల్లాలకు చెందినవారు కూడా.. హైదరాబాద్ జిల్లాలో అధికంగా దరఖాస్తులు వచ్చాయి. ఇక అతి తక్కువగా మేడ్చల్ జిల్లా నుంచి 2,265 దరఖాస్తులు రాగా.. ఆ తర్వాత జయశంకర్ భూపాలపల్లి జిల్లా నుంచి 2,828 దరఖాస్తులు అందాయి. ఈ లెక్కన ఒక్కో పోస్టుకు 25 చొప్పున పోటీపడుతున్నారు.డీఎస్సీ పోస్టులకు సంబంధించి.. డీఎడ్, బీఎడ్ పూర్తిచేసి టెట్ ఉత్తీర్ణులైన అభ్యర్థులు సెకండరీ గ్రేడ్ టీచర్(SGT), స్కూల్ అసిస్టెంట్(SA).. రెండు పోస్టులకు దరఖాస్తుకు అర్హులు. బీఈడీ పూర్తిచేసి టెట్ ఉత్తీర్ణత ఉన్నవారు స్కూల్ అసిస్టెంట్ లోనే రెండు సబ్జెక్టులకు దరఖాస్తు చేసుకోవచ్చు. ఆ ప్రకారం డీఎస్సీకి పోటీపడే అభ్యర్థుల సంఖ్య 2 లక్షల వరకు ఉండవచ్చని విద్యాశాఖ అంచనా వేస్తోంది. ఇటీవల నిర్వహించిన టెట్ పరీక్షలో ఉత్తీర్ణులైనవారికి డీస్సీకి ఉచితంగా అర్హత కల్పించింది. దీంతో 23,919 మంది అభ్యర్థులు దరఖాస్తు ఫీజు చెల్లించకుండానే దరఖాస్తు చేసుకున్నారు.తెలంగాణలో 11,062 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి ఫిబ్రవరి 29న 'మెగా డీఎస్సీ-2024' నోటిఫికేషన్ పాఠశాల విద్యాశాఖ విడుదల చేసిన సంగతి తెలిసిందే. అభ్యర్థుల నుంచి మార్చి 4 నుంచి జూన్ 20 వరకు దరఖాస్తులు స్వీకరించారు. మొత్తం ఖాళీల్లో సెకండరీ గ్రేడ్ టీచర్ (SGT)- 6,508 పోస్టులు, స్కూల్ అసిస్టెంట్ - 2,629 పోస్టులు, లాంగ్వేజ్ పండిట్- 727 పోస్టులు, పీఈటీ(వ్యాయామ ఉపాధ్యాయులు)-182 పోస్టులు, స్పెషల్ ఎడ్యుకేషన్(స్కూల్ అసిస్టెంట్)- 220 పోస్టులు, స్పెషల్ ఎడ్యుకేషన్ (ఎస్జీటీ)- 796 పోస్టులు ఉన్నాయి. ఈ పోస్టుల భర్తీకి జులై 17 నుంచి 31 వరకు రెండువారాలపాటు డీఎస్సీ పరీక్షలు నిర్వహించనున్నారు. మహబూబ్ నగర్, రంగారెడ్డి, హైదరాబాద్, మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్, ఖమ్మం, నల్లగొండ, సంగారెడ్డి జిల్లా కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించనున్నారు. ఒకే అభ్యర్థి సెకండరీ గ్రేడ్ టీచర్, స్కూల్ అసిస్టెంట్ పోస్టులతో పాటు స్కూల్ అసిస్టెంట్ లో గణితం, ఫిజిక్స్ వంటి వివిధ సబ్జెక్టులకు పోటీపడనున్న నేపథ్యంలో పరీక్షలను వేర్వేరు తేదీల్లో నిర్వహించేలా ప్రణాళికలు సిద్ధం చేయాల్సి ఉంటుంది.

## హర్యానాలో అలా.. తెలంగాణలో ఇలా

### ఇదేంటి రాహుల్ గాంధీ జీ.. కేటీఆర్ ట్వీట్





హైదరాబాద్, జూన్ 23 (ప్రజాస్వరం): బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు మాజీ స్పీకర్, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి ఇటీవల కాంగ్రెస్‌లో చేరిన విషయం తెలిసిందే. ఈ విషయమై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ట్విటర్ వేదికగా పరోక్షంగా స్పందించారు. ఇటీవల హర్యానాలో కాంగ్రెస్ ఎమ్మెల్యే కిరణ్ చౌదరి ఇటీవల బీజేపీలో చేరారు. ఆయనను డిస్ క్వాలిఫై చేయాలని కాంగ్రెస్ అక్కడి స్పీకర్‌ను డిమాండ్ చేసింది. ఈ వార్త క్లిప్‌ను షేర్ చేసిన కేటీఆర్... కాంగ్రెస్ పార్టీకి జరిగితే కన్నీళ్లు నదిలా ఉప్పొంగుతాయి.. కానీ తెలంగాణలో కాంగ్రెస్ లోకి ఫిరాయిస్తే ఏదో సాధించినట్లు సంబరాలు చేసుకుంటున్నారని సెటైర్లు వేశారు. కాంగ్రెస్ ద్వంద ప్రమాణాలు, కపటత్వం పీక్స్‌కు చేరిందని ఫైర్ అయ్యారు. ఈ ఫిరాయింపులపై మీరేమంటారు రాహుల్ గాంధీ జీ అని ప్రశ్నించారు.

## రాంగ్ రూట్‌లో వస్తే కేసే..

హైదరాబాద్, జూన్ 23 (ప్రజాస్వరం): హైదరాబాద్‌లో కొందరు వాహనదారులు.. భయం, భక్తి లేకుండా వ్యవహరిస్తున్నారు. ట్రాఫిక్ ఫోలిస్ ఉండే సర్కిల్ వద్ద కూడా రాంగ్ రూట్‌లో ప్రయాణిస్తున్నారు. అయితే ఇటీవల ఎక్కువగా జరుగుతున్న రోడ్డు ప్రమాదాల్లో రాంగ్ రూట్ డ్రైవింగే ప్రధాన కారణమని గుర్తించిన పోలీసులు కీలక నిర్ణయం తీసుకున్నారు. ఇకపై ట్రాఫిక్ రూల్స్ మరింత స్ట్రిక్ట్‌గా అమలు చేయాలని నిర్ణయించారు. ఈ మేరకు యాక్షన్‌లోకి దిగారు సైబరాబాద్ పోలీసులు. అంతేకాదు రాంగ్ రూట్‌లో వాహనాలు నడిపేవారిపై.. 336 సెక్షన్ కింద కేసు ఫైల్ చేయడం షుర్ చూశారు. రాంగ్‌రూట్‌లో వచ్చి పట్టుబడిన వాహనదారులపై సంబంధిత లా అండ్ ఆర్డర్ పోలీస్ స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ నమోదు చేసి, చార్జీషీట్ ఫైల్ చేస్తున్నారు. రాంగ్‌రూట్‌లో వాహనాలు నడపడం వల్ల రాంగ్‌సైడ్ వచ్చే వాహనదారులకే కాకుండా.. సవ్యమైన మార్గంలో వస్తున్నవారు కూడా ప్రమాదాలకు గురవుతున్నారు. ఫైన్స్ వేసినా కొందరిలో మార్పు రావడం లేదు. అందుకే ఇలా నిర్లక్ష్యంగా వాహనాలు నడిపేవారిపై సెక్షన్ 336 కింద ఎఫ్ఐఆర్ నమోదు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ కేసుల్లో మూడేండ్ల వరకు జైలు శిక్ష పడే అవకాశం ఉంటుంది. ఇలా రాంగ్ రూట్స్‌లో వాహనాలు నడిపేవారిని ట్రాక్ చేసేందుకు.. పలు ప్రాంతాల్లో ఏఎన్‌పీఆర్ కెమెరాలు ఏర్పాటు చేశారు. సో.. ఇకపై రాంగ్ రూట్‌లో వెళ్లారంటే.. మీరు జైలుకు వెళ్లాల్సిందే.